క్లుప్తంగా

మెడికల్ అసెస్మెంట్ క్యాంప్



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కదిరి అర్బన్: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అఖిల భారతీయ సమాగం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించారు. జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి హాజరయ్యారు. 193 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

గర్భిణుల నమోదు వందశాతం చేపట్టాలి

కదిరి అర్బన్: పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశా కార్యకర్తలకు కేటాయించిన గర్భిణుల నమోదు సంఖ్యను వందశాతం చేపట్టాలని చెప్పారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. ఆయన వెంట డాక్టర్ వినోద్‌కుమార్, సీహెచ్‌ఓ లక్ష్మీదేవమ్మ, సూపర్‌వైజర్లు పద్మజ, విజయశేఖర్, పలువురు ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ సేవల కోసం వాట్సాప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం పుట్టపర్తి మండలం పెడపల్లిలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో సమావేశం ఏర్పాటు చేసి వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించారు.

తాడిమర్రి: వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగం మహిళలకు సూచించారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ ముందు, వెలుగు కార్యాలయం ముందు ఏపీఎం సాంబశివునితో కలసి మహిళలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన నిర్వహించారు.

మెలకువలు పాటించండి

కనగానపల్లి: మల్బరీ సాగులో మెలకువలు పాటించాలని సెరికల్చర్ జేడీ శోభారాణి రైతులకు సూచించారు. నా పట్టు .. నా అభిమానం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేపకుంట గ్రామంలో మల్బరీ పంట సాగు, పట్టు పరుగుల పెంపకంపై మల్బరీ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్బరీ పంట సాగులో తీసుకోవలసిన చర్యలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మురళీ, రమ్య రైతులకు వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీ అప్పలనాయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ సుధాకర్‌నాయుడు, సెరికల్చర్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, టీఓలు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ముదిగుబ్బ: అన్ని శాఖల సిబ్బంది సహకారంతో బాల్య వివాహాలను అరికడదామని, అబార్షన్లు నివారిద్దామని డాక్టర్ రాజేంద్ర సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో లింగ వివక్ష నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన, అబార్షన్లు నివారించుట, పోక్సో చట్టం, జాతీయ నులిపురుగుల దినోత్సవం తదితర వాటిపై అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ ఈ నెల 12న 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, ఎంఈఓలు వెంకటా చలపతి, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.


యువతి అదృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన కమతం శివయ్య కుమార్తె కమతం నందిని అనే యువతి అదృశ్యమైంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సీఐ 63058 00429, 98858 54742 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష

సాక్షి బృందం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యానికి రక్ష అని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం తాడిమర్రి, కదిరి మండలం మల్లయ్యగారిపల్లి, ధర్మవరం పట్టణంలోని శివానగర్, బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి, ముదిగుబ్బ మండల కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వైద్యులు, తదితరులు తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.

పనిచేయని ఫోన్లు మాకొద్దు



ఫోన్లను వెనక్కిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఓడీచెరువు : ప్రస్తుత ఆన్‌లైన్ సేవలకు ఏమాత్రం పనిచేయని సెల్‌ఫోన్లు తమకు వద్దని అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం ఐసీడీఎస్ ఓడీచెరువు ప్రాజెక్ట్ కార్యాలయంలో వెనక్కు ఇచ్చేశారు. 5జీ సామర్థ్యంతో కూడిన మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.



నీరులేక వట్టిపోయిన తాడిమర్రి తూర్పు చెరువు



మేడిమాకులపల్లి సమీపంలోని పీఏబీఆర్ కాలువ

ఉద్యాన రైతు విలవిల

- వట్టిపోతున్న వ్యవసాయ బోర్లు
- పండ్లతోటలను కాపాడుకునేందుకు అగచాట్లు
- పీఏబీఆర్ నీటి కోసం రైతుల ఎదురుచూపు

తాడిమర్రి: వర్షాభావ పరిస్థితులు ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడం.. వ్యవసాయబోర్లు వట్టిపోవడం.. వెరసి నీరందక పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి తడులు అందిస్తున్నారు. తాడిమర్రి మండలంలో పండ్ల తోటలకు ప్రసిద్ధిగాంచింది. 24 వేల హెక్టార్ల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో 5,800 హెక్టార్లలో చీనీ, 1,900 హెక్టార్లలో మామిడి, 1500 హెక్టార్లలో అరటి తోటలు సాగులో ఉన్నాయి. గత ఏడాదితో పాటు ఈ ఏడాది మండలంలో వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. సాధారణంగా వర్షాకాలంలో బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉండటం సహజం. అయితే గడిచిన రెండేళ్లలో ఆశించిన మేర వర్షాలు కురవపోవడంతో గ్రామాల్లో సాగు నీటి సమస్య అధికమైంది. కళ్లెదుటే ఎండుతున్న పంటలను చూడలేకపోయిన రైతులు డబ్బు వెచ్చించి ట్యాంకర్లతో నీటిని తెప్పించి కాపాడుకుంటున్నారు. ఇంకొందరు అప్పులు చేసి మరీ రెండు నుంచి మూడు బోర్లు వేయించినా చుక్కనీరు పడటం లేదు.

పండ్లతోటల సాగు పెరిగిందిలా...

2019 – 2024 మధ్య కాలంలో పండ్లతోటల సాగు గణనీయంగా పెరిగింది. నాడు వర్షాలు పుష్కలంగా కురవడం, అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రత్యేక చొరవతో తాడిమర్రి తూర్పు చెరువు, పడమటి చెరువు, ఎం.అగ్రహారం, నిడిగల్లు, నార్శింపల్లి, పుల్లంపల్లి గ్రామాల చెరువులతో పాటు మేడిమాకులపల్లి, పుల్లానారాయణపల్లి, ఏకపాదంపల్లిలోని కుంటలను నింపడంతో మండలంలో భూగర్భ జలాలు పెరిగాయి. 60 ఏళ్లుగా నిండని తాడిమర్రి తూర్పు చెరువుకు మరవపారేటట్లు నీటిని వదిలించారు. దీంతో చీనీ, మామిడి, అరటి సాగు వైపు పలువురు రైతులు మొగ్గు చూపారు.

పీఏబీఆర్ నీటితో చెరువులు నింపాలి

తంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి ఇటీవల నీటిని విడుదల చేశారు. విషయం తెలుసుకున్న రైతులు పీఏబీఆర్ నీటిని విడుదల చేయించి చెరువులను నింపితే ఈ ఏడాది పండ్లతోటలను కాపాడుకోవచ్చునని రైతులు భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నీటిపారుదల అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పీఏబీఆర్ నీటిని విడుదల చేయించి మండలంలోని చెరువులను నింపాలని రైతులు కోరుతున్నారు.

ట్యాంకర్లతో నీరు పెడుతున్నా

నాకున్న రెండున్నర ఎకరాల్లో 350 చీనీ చెట్లు పెట్టాను. రెండు నెలలుగా బోరులో నీరు రావడం లేదు. దీంతో చెట్లను కాపాడుకోవడానికి సమీపంలో ఎక్కడా నీటి వసతి లేదు. దీంతో రోజూ రెండు ట్యాంకర్ల నీరు తెప్పిస్తున్నాను. ఇందు కోసం డబ్బు ఎక్కువగా ఖర్చవుతోంది. ప్రభుత్వం కనీసం ట్యాంకర్ల బిల్లులైనా అందించాలి.



–సీ.గంగప్ప, కునుకుంట్ల, తాడిమర్రి

ప్రజాప్రతినిధులు స్పందించాలి

మండలంలో రెండేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీరు తగ్గిపోయింది. పండ్ల తోటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్ని బోర్లు వేసినా చుక్కనీరు పడకపోవడంతో చివరకు ట్యాంకర్ల ద్వారా తెప్పించి కాపాడుతున్నారు. ఇప్పటికైనా ఇటు ప్రజాప్రతినిధులు, అటు నీటి పారుదల శాఖ అధికారులు స్పందించాలి.



– మల్లప్పగారి లక్ష్మీరెడ్డి, తాడిమర్రి

కమిషనరేట్ ముట్టడిలో నల్లమాడ సర్పంచులు



ఆందోళనలో పాల్గొన్న సర్పంచులు

నల్లమాడ: పంచాయతీ నిధులు విడుదల చేయాలని మంగళవారం విజయవాడలో సర్పంచ్‌లు నిర్వహించిన పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి నల్లమాడ మండలంలోని సర్పంచులు తరలి వెళ్లారు. సర్పంచ్‌లు వై.రజనీకాంత్‌రెడ్డి, ప్రసాద్, బొజ్జేనాయక్, లింగమూర్తి, నాగరాజునాయుడు, నరసింహమూర్తి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత సీహెచ్‌ఓ మృతి



నాగరత్నమ్మ (ఫైల్)

నల్లమాడ: చౌటకుంటపల్లికి చెందిన విశ్రాంతి సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్) చెరువు నాగరత్నమ్మ (65) గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. నాగరత్నమ్మ వైద్య ఆరోగ్య శాఖలో నర్స్ నుంచి సీహెచ్‌ఓగా ఎదిగారు. నల్లమాడ, అనంతపురం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఈమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోలీసు ఉద్యోగం గౌరవప్రదమైనది

తాడిమర్రి: పోలీసు ఉద్యోగంలో కష్టాలు ఉంటాయని ఓర్పు, సహనంతో వాటిని భరిస్తే అంతకు మించి గౌరవం లభిస్తుందని ఎస్‌ఐ కృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక విలేకరుల భవనంలో గ్రంథాలయ అధికారి డీ.శీనానాయక్ ఆధ్వర్యంలో పోలీసు ఉద్యోగానికి నూతనంగా ఎంపికైన యువకులకు జరిగిన సన్మాన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారితో కలసి యువకులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

చంద్రబాబు మోసాలను వివరిద్దాం



కృష్ణాపురంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మహమ్మదాబాద్‌లో ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని వైఎస్సార్‌సీపీ బుక్కపట్నం మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప అన్నారు. మంగళవారం కృష్ణాపురంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ 50 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పింఛన్లు ఇస్తామని దాని గురించి మాట్లాడటం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద వివిధ కారణాలతో పలువురు అర్హులకు లబ్ధి చేకూరకుండా చేశారని విమర్శించారు. ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దారుణంగా మోసం చేశారన్నారు. ఏడాది పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కృష్ణాపురం సర్పంచ్ హుస్సేన్, గణికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయారెడ్డి, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎల్‌ఐసీ చంద్ర, నీలూరి ఈశ్వర్, ఎంపీటీసీ కేశవనాయుడు, విశ్రాంత ఉపాధ్యా యుడు భాస్కర్‌రెడ్డి, ఉపేంద్ర, కిష్ట, ఆర్య వైశ్య నాయకుడు రమణ, శంకర్, మంగ్లీ కేశవ, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు ధర్మతేజరెడ్డి, బుచ్చయ్యగారిపల్లి వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, అమర్‌నాథరెడ్డి, మల్లేశ్, శివయ్య, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలను ఎండగడదాం

ఓడీచెరువు (అమడగూరు) : అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన బాబు మోసాలను గడపగడపకూ తిరిగి ఎండగడదామని వైఎస్సార్‌సీపీ అమడగూరు మండల కన్వీనర్ జయప్ప, నాయకులు శివశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అమడగూరు మండలం మహమ్మదాబాద్ పంచాయతీలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా బాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, మైనారిటీ నాయకులు సిబక్తుల్లా, ఉత్తప్ప, నక్కల చెన్నప్ప, గంగులమ్మ, మహబూబ్ బాషా, రాంప్రసాద్, తబ్రేజ్, జహీర్, శీనా, అంజి, గోపాల్‌రెడ్డి, జిలాన్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు

దగా.. మోసాలకు కేరాఫ్ చంద్రబాబు



గొల్లవారిపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్



కె.బ్రాహ్మణపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త, తదితరులు

తనకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే దగా.. మోసాలకు కేరాఫ్ అని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ విమర్శించారు. తనకల్లు మండలంలోని గొల్లవారిపల్లిలో మంగళవారం ×బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ¤ కార్యక్రమం నిర్వహించారు. సమన్వయకర్త మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచకాలు, మోసాలను గ్రామ గ్రామానా ప్రజలకు వివరిద్దామన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో లెక్కకు మించిన హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఆయన రాజకీయ జీవితమంతా అబద్ధాలతోనే సాగిందని ఎద్దేవా చేశారు. అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, సర్పంచులు సరస్వతీ, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ విజయలక్ష్మీ, మండల కమిటీ సభ్యులు ముస్తఫా, నరేంద్ర, మోహన్, సూరి, బయారెడ్డి, రమణారెడ్డి, రెడ్డిపీరా, బాబ్‌జాన్, సీనియర్ నాయకులు భక్తవత్సలరెడ్డి, దేశాయి సంజీవరెడ్డి, బీఎస్ కలాం, స్థానిక నాయకులు జంగం రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, శంకర్ రెడ్డి, అమాన్, రామకృష్ణ, శ్రీనాథ్, బాబ్‌జాన్, శ్రీకంఠారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, షామీర్ బాషా, అబ్దుల్, ప్రకాష్, హరి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మంగళవారం సర్పంచ్‌లు ఖుర్షిద్‌బీ, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని కె.బ్రాహ్మణపల్లి, ఎగువపల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల హామీల అమలుకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా హామీలపై ప్రశ్నించే వారిని జైల్లో పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణికంఠనాయక్, నాయకులు మధుకర్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి, ఇర్షాద్, క్రిష్టానాయక్, సర్పంచ్‌లు రజనీష్‌రెడ్డి, నారాయణనాయక్, రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జైనుల్లా, పవన్ కుమార్, బాబాఫక్రుద్దీన్, ఎంపీటీసీ కుమార్‌నాయుడు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప్పార్లపల్లిలో...

నల్లచెరువు: ఉప్పార్లపల్లిలో బుధవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటకు నిర్వహించనున్న కార్యక్రమంలో సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పాల్గొంటారని తెలిపారు. మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

బస్‌షెల్టర్‌కు స్థల పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని కేజీబీవీ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు కోసం అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ ఇంజినీర్ నాగరాజు, ఆర్టీసీ రీజనల్ డిప్యూటీ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

కదిరి టౌన్: లేని స్థలానికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అగ్రిమెంట్ పేరిట డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడి కథనం మేరకు... పట్టణంలోని వలీసాబ్ రోడ్డులో నివాసం ఉన్న షేక్ మహమ్మద్‌కు తుమ్మల ఇలియాజ్ అనే వ్యక్తి సర్వే నంబర్ 243లో 70 సెంట్ల స్థలం ఉందని చెప్పి అడ్వాన్సుగా రూ.5 లక్షలకు తీసుకుని అగ్రిమెంట్ చేసిచ్చాడు. ఆ తర్వాత మహమ్మద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వే నంబర్‌పై ఆరా తీయగా ఆ స్థలం లేదని తేలింది. దీంతో తనను మోసం చేశారని గ్రహించి.. తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరితే.. 'ఇచ్చేది లేదని, ఎక్కువ మాట్లాడితే నీ అంతు చూస్తా' అని ఇలియాజ్ బెదిరించాడు. దీంతో బాధితుడు మహమ్మద్ మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు తుమ్మల ఇలియాజ్‌పై సీఐ వి.నారాయణ రెడ్డి కేసు నమోదు చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు



విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ధర్మవరం: స్మార్ట్ మీటర్లు బిగించరాదని, విద్యుత్ చార్జీలు పెంచరాదని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ధర్మవరం మార్కెట్‌లోనున్న విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద మంగళవారం వారు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, సీపీఐ నాయకులు రవికుమార్, రమణ, సీఐటీయూ నాయకులు జె.వి.రమణ, అయుబ్‌ఖాన్ మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో రైతులు, ప్రజలు, వ్యాపారులకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారన్నారు. కూటమి సర్కారు కొలువుదీరాక తిరిగి స్మార్ట్‌మీటర్ల విధానాన్ని అమలు చేయడాన్ని తప్పుపట్టారు. ఇక విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారన్నారు. అనంతరం ఏడీకి వినతిపత్రం అందించారు.

- పుట్టపర్తి, నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లి, నల్లచెరువు, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి సబ్ స్టేషన్ల వద్ద ఆందోళనలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

స్మార్ట్ మీటర్ల విధానం ప్రమాదకరం

కదిరి టౌన్: ఇళ్లు, వ్యాపార సముదాయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానం అమలు చేయరాదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎస్ షానవాజ్ అన్నారు. మంగళవారం ఆయన కదిరిలో విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ ఫోన్ మాదిరిగా విద్యుత్‌కు కూడా ముందస్తుగా రీచార్జ్ చేసుకోవాలనే విధానం చాలా ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అల్లాబకాష్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైనుల్లా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి



కదిరిలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కదిరి అర్బన్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కదిరిలో ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన జర్నలిస్టులకు వెంటనే కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ చెరువు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కోశాధికారి జిలాన్, జిల్లా సంయుక్త కార్యదర్శి రామ్మోహన్, నాయకులు నజీర్, చంద్రారెడ్డి, అజయ్ తదితరులు ఉన్నారు.

తాడిమర్రి: జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డిని కోరారు. మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్ డేని పురస్కరించుకుని ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులు గుమ్మడం ఓబుళపతి (విశాలాంధ్ర), డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులు చందమామ వీరనారప్పలు విలేకరుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

ఎన్‌పీకుంట: అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే మండల నాయకులు, విలేకరులు మంగళవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు.

ధర్మవరం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్ డేని పురస్కరించుకుని ధర్మవరంలో ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ అధికారికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

బత్తలపల్లి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్‌చౌదరి డిమాండ్ చేశారు. మంగళవారం జర్నలిస్టు డేను పురష్కరించుకుని బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఓడీచెరువు : మండల కేంద్రం ఓడీచెరువులో ప్రెస్‌క్లబ్ కమిటీ, ఏపీయూడబ్ల్యూజే సంయుక్తంగా జర్నలిస్ట్‌డేని పురస్కరించుకుని వివిధ సమస్యలపై తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ముదిగుబ్బ: జర్నలిస్టుల సమస్యలపై ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంగళవారం తహసీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో గొడవ

- గాయపడిన ఒకరి పరిస్థితి విషమం
- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని బాధితుల ఆరోపణ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రంగప్రసాద్

సాక్షి టాస్క్‌ఫోర్స్: కొత్తచెరువులో స్థల వివాద విషయమై ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా గాయపడిన ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయసముద్రానికి చెందిన సూర్యనారాయణరెడ్డి భార్య సుశీలమ్మతో కొత్తచెరువుకు చెందిన దాల్‌మిల్ సూరి భార్య మహాలక్ష్మి కొత్తచెరువులో ఉన్న తన 7.5 సెంట్ల స్థలాన్ని ఆయకం పెట్టి ఐదేళ్ల క్రితం నూటికి రూ.10 వడ్డీ ప్రకారం రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. క్రమం తప్పకుండా వడ్డీ – అసలు చెల్లిస్తూ రూ.40 లక్షల దాకా చెల్లించారు. మిగతా నగదు చెల్లిస్తామని, తమ స్థలం తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాలని మహాలక్ష్మి అడిగారు. సుశీలమ్మ స్థలాన్ని రిజిస్టర్ చేయించకుండా మహాలక్ష్మిని వేధిస్తూ వస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం కోర్టులో ఉన్నప్పటికీ జూన్ 7న సుశీలమ్మ కుమారుడు సాగర్‌రెడ్డి రెండు వాహనాల్లో కిరాయి గూండాలను కొత్తచెరువులో ఉన్న స్థలం వద్దకు తీసుకొచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నించగా మహాలక్ష్మి వర్గీయులు అక్కడ చేరుకుని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. సాగర్‌రెడ్డి వర్గీయులు చేసిన దాడిలో మహాలక్ష్మి వర్గానికి చెందిన రంగప్రసాద్ తలకు తీవ్రమైన గాయం తగలడంతో మతి స్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతన్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే రెండు వర్గాల మధ్య ఇంత గొడవ జరిగినా పోలీసులు ఒక వర్గంపైనే తూతూ మంత్రగా కేసులు కట్టి మహాలక్ష్మి వర్గంలో 38మంది వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.